# నిరుద్యోగం ఎన్ని రకాలు?

**పోటీపరీక్షల్లో ఎక్కువగా చర్చకు వచ్చే అంశాల్లో నిరుద్యోగం ఒకటి. ఈ సమస్య స్వరూప స్వభావాలు గ్రహించడం, భిన్న కోణాల పరిజ్ఞానం పెంచుకోవడం అభ్యర్థుల కర్తవ్యం. దీనికి ఉపకరించే కథనం...**

నిరుద్యోగాన్ని అంచనా వేయడానికి అంతర్జాతీయ ప్రమాణాలున్నాయి. ఈ ప్రమాణాల్ని చాలా దేశాలు పాటించవు. పని చేయగల సామర్థ్యం ఉండి, పని చేయడానికి సుముఖంగా ఉన్నవారిని అందరినీ పరిగణనలోకి తీసుకుని వారిలో నిరుద్యోగుల సంఖ్యను శాతంగా లెక్కిస్తే అదే ఒక దేశ/ రాష్ట్ర/ ప్రాంత నిరుద్యోగం. ఈ నిర్వచనం యథాతథంగా దానికదే లోపాలతో కూడినది. అయినా అమలు జరగడం లేదు.

ఒక నిరుద్యోగి ఏ కారణం వల్ల నిరుద్యోగిగా ఉన్నాడన్న ప్రశ్నకు వచ్చే సమాధానాన్ని బట్టి వర్గీకరణ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే సమయంలో ఈ వర్గీకరణ అక్కరకు వస్తుంది.

**1. ఫ్రిక్షనల్:** ఒక రంగంలో నైపుణ్యం సాధించి అక్కడ ఉపాధి దొరక్క తప్పనిసరై మరో రంగంలో పని చేయడం, ఆ క్రమంలో అభ్యర్థులు ఉద్యోగాలు మారుతూ పోవడం ఫ్రిక్షనల్ నిరుద్యోగం. ఏయే రంగాల్లో ఎంతెంతమంది అవసరం ఉందో అంచనా వేయడంలో ప్రభుత్వాల, విధాన నిర్ణేతల వైఫల్యం, ఆయా రంగాలకు అవసరమైన నిపుణులను తయారుచేసే విద్యావిధానంలో వైఫల్యం వల్ల ఈ తరహా నిరుద్యోగం ఏర్పడుతుంది. ఉపాధి అవసరం ఉన్న రంగాల సమాచారం అభ్యర్థులకు అందకపోయినా, తగిన సమయంలో సమాచారం ఇవ్వకపోయినా ఈ నిరుద్యోగం తలెత్తుతుంది.




**2. స్ట్రక్చరల్:** అంటే వ్యవస్థాగత నిరుద్యోగం. ఇదే పెద్ద సమస్య కూడా. ఉద్యోగాల అవసరాలకు తగినట్లుగా అర్హత అందించడంలో వ్యవస్థాగత వైఫల్యం దొర్లుతుంది. ఈ వైఫల్యానికి పునాది వ్యవస్థ నిర్మాణంలో ఉంటుంది. అందుబాటులో ఉన్న వనరుల, సంపదల పంపిణీలో హెచ్చుతగ్గులు, సంపదల కేంద్రీకరణ ఈ నిరుద్యోగానికి కారణం. నైపుణ్యం అభివృద్ధి చేయకపోవడం, అభ్యర్థులకు అతితక్కువ వేతనాలు ఇవ్వజూపడం.. ఈ నిరుద్యోగంలో భాగం.

**3. సైక్లికల్:** పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ చక్రగతి గమనంలో ప్రయాణిస్తుందని గతంలో చెప్పుకున్నాం. ఈ క్రమంలో ఉత్పన్నమయ్యేదే సైక్లికల్ నిరుద్యోగం. ఆర్థిక వ్యవస్థ బూమ్ దశలో ఉంటే ఉద్యోగాలు పెరుగుతాయి. మాంద్య (రిసెషన్) దశలో కొనుగోళ్లు పడిపోయి ఉత్పత్తి తగ్గించుకోవాల్సి వస్తుంది. అందువల్ల సంస్థలు ఉద్యోగులను తొలగిస్తాయి. రానురానూ సైక్లికల్ నిరుద్యోగం కూడా స్ట్రక్చరల్ నిరుద్యోగంగా ఘనీభవిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో సాధారణ సంక్షోభం ఇంకా తీవ్రమవ్వడం దీనికి కారణం.

**4. సీజనల్:** కొన్ని సరుకుల ఉత్పత్తి కొన్ని సీజన్లలోనే సాధ్యం. భూమిలో ఉండే వనరులపై ఆధారపడిన ఉత్పత్తులైతే సంవత్సరం పొడవునా నడుస్తాయి. వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడే పరిశ్రమల్లో ఆయా పంటలు పండితేనే ఉత్పత్తి జరుగుతుంది. ఉదాహరణకు జనపనార పరిశ్రమలకు ఒక సీజన్‌లోనే పని ఎక్కువ. తరుణం కానపుడు జనపనార కార్మికులు చాలామందికి పని దొరకదు. పరిశ్రమలు మూతపడడం సర్వసాధారణం. చక్కెర పరిశ్రమలకు చెరకు పంటలతో లంకె. వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడవునా పని దొరకని సంగతి తెలిసిందే.

జనాభా ఎక్కువయితే నిరుద్యోగం అధికమవుతుందనే వాదన ఒకటుంది. కానీ జనాభా ఎంత ఎక్కువైనా వారికి తగిన అవసరాలుంటాయి; ఆ అవసరాలే ఉపాధిని సృష్టిస్తాయి. ప్రతి మనిషీ కడుపుతోనే పుట్టడు. అతనికి పనిచేయడానికి కాళ్ళూ, చేతులూ కూడా ఉంటాయి. వ్యవస్థాగత, నిర్వహణ లోపాలను జనాభా మీదకు నెట్టివేయడం ఒక మేధో వైఫల్యం.

---

‘అవునూ, మన దేశంలో నిరుద్యోగులు 4 కోట్లే అంటారేమీ? ఆ లెక్కన మిగతా వారంతా ఉద్యోగం చేస్తున్నట్లేనా? ’- అడిగాడు కొండల్రావు.

‘అది చదువుకున్న నిరుద్యోగుల లెక్క. చదువుకున్నవారిలో 4 కోట్లమందికి ఉద్యోగాలు లేవని దాని అర్థం. ఎలాంటి చదువూ లేకుండా, చేయడానికి పని లేని నిరుద్యోగులు దేశంలో ఇంకా అనేక కోట్లమంది ఉన్నారు. వారు తరచుగా ఆర్థిక పండితుల లెక్కల్లో కనిపించరు’ వివరించాడు రామారావు.




నూతక్కి విజయశేఖర్
www.teluguvartalu.com


‘చదువు లేకపోతే నిరుద్యోగులు కాదా? అన్యాయం కదా? ’

‘కదా మరి. ద్రవ్యోల్బణం ఉద్దేశపూర్వకంగా కొద్దిమేరకు ఉండేటట్లు జాగ్రత్త తీసుకున్నట్లుగానే నిరుద్యోగం కూడా ఉండేటట్లు చూస్తారు. ఉద్యోగార్థులు ఎంత ఎక్కువమంది ఉంటే వారి వేతనాలు అంత తక్కువ ఇవ్వవచ్చు. స్థూల ఆర్థికంలో అదొక అప్రకటిత సూత్రం’

‘అలా చేస్తే కంపెనీల పక్షం వహించినట్లే కదా!’

‘వేతనాలు ఎక్కువగా ఉంటే తమ ఉత్పత్తులకు ఎక్కువ ధర నిర్ణయించాల్సి వస్తుందనీ, అది మళ్లీ కార్మికులకే నష్టమనీ సంస్థలు వాదిస్తాయి. ఈ వాదన పూర్తిగా కాకపోయినా కొంత నిజమే. ప్రభుత్వాలు అటు సంస్థల లాభదాయకతనూ, ఇటు కార్మికుల జీవన స్థాయి మెరుగుదలనూ పరిగణిస్తూ విధానాలు రూపొందించాలి. ప్రభుత్వాలు విధించే పన్నులు కూడా ఇందులో పాత్ర పోషిస్తాయి. పన్నులు తగ్గితే ఆ మేరకు కొంత ఆదాయాన్ని వేతనాలకు తరలించే వెసులుబాటు సంస్థలకు ఉంటుంది.’

‘నిరక్షరాస్య నిరుద్యోగుల సంగతి? ’

‘వారికీ కనీస వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ ఉంది. వారు ఎక్కువగా వ్యవసాయరంగంలో ఉన్నారు. వారికి కనీస వేతనాలు నిర్ణయిస్తే రైతులకు సమస్య. మధ్యేమార్గంగా వేతనాల జోలికి పోకుండా సబ్సిడీల ద్వారా ఆ లోపాన్ని భర్తీ చేస్తారు. అసలు అక్షరాస్యతతో సంబంధం లేకుండా కూడా నిరుద్యోగాన్ని వివిధ రకాలుగా ఆర్థికవేత్తలు వర్గీకరిస్తారన్న సంగతి తెలుసా? ’

‘మళ్లీ నిరుద్యోగుల్లో కూడా రకాలా? ’

‘మరి! ఫ్రిక్షనల్ అనెంప్లాయ్‌మెంట్, స్ట్రక్చరల్, సైక్లికల్, సీజనల్ అనెంప్లాయ్‌మెంట్.. ఇలా’.